ప్రజాశక్తి

శుక్రవారం 24 అక్టోబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

దొంగనోట్ల కలకలం

- విశాఖలో తయారీ కేంద్రం గుట్టు రట్టు
- ప్రధాన నిందితుడు అరెస్టు, ముగ్గురు పరారీ

తాము పట్టుకున్న దొంగ నోట్లను ప్రదర్శిస్తున్న పోలీసాధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖలో మళ్లీ దొంగ నోట్ల కలకలం రేగింది. తాజాగా ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగ నోట్ల తయారీ కేంద్రంపై పోలీసులు దాడులు జరిపి ప్రధాన నిందితున్ని అరెస్టు చేశారు. కేసు వివరాలను విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి మేరీ ప్రశాంతి గురువారం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ద్వారకా ఎసిపి అన్నెపు నరసింహమూర్తితో కలిసి వెల్లడించారు. ఆమె కథనం మేరకు..

ఎంవిపి.కాలనీ సెక్టర్ - 11లో ఒక ప్లాట్‌ను అద్దెకు తీసుకొని దొంగ నోట్లు తయారు చేస్తున్నారన్న సమాచారం ఎంవిపి పోలీసులకు, టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందింది. దీంతో వారు దాడులు జరిపారు. శ్రీరామ్ గుప్తా ల్యాప్‌టాప్, ప్రింటర్ సహాయంతో రూ.500, రూ.200 కరెన్సీ నోట్లను ముద్రిస్తూ పట్టుబడ్డాడు. సంబంధిత ప్రదేశంలోని దొంగ నోట్ల ముద్రణకు సంబంధించిన వస్తువులు అన్నింటినీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో ఆనంద్, వరప్రసాద్, గంగాధర్‌లు నిందితులుగా ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గతంలో దొంగ నోట్లను చెలామణీ చేసేందుకు ప్రయత్నిస్తూ శ్రీరామ్ గుప్తా, ఆనంద్, వరప్రసాద్‌లు పోలీసులకు పట్టుబడ్డారని డిసిపి మేరీ ప్రశాంతి తెలిపారు. ప్రధాన నిందితుడు శ్రీరామ్ గుప్తాపై ఇండోర్, ఉజ్జయిని, ముంబయి ప్రాంతాలలో దొంగ నోట్లు తయారీ, చెలామణీకి సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు. కేసును ఎంవిపి ఎస్ఐ కెఎన్ఎస్వి.ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. గతంలోనూ విశాఖలో పలుమార్లు దొంగ నోట్లు కలకలం రేపిన విషయం తెలిసిందే.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ రద్దుకు

వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి - గాజువాక : ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని పెదగంట్యాడలో ఏర్పాటు చేయొద్దంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేస్తూ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చేత ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఏరియా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు జిల్లా కార్యదర్శి కె.దేవసహాయం, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు కె.సత్యాంజనేయ, కె.వెంకటరావు, బి.గురప్ప, వై.సోమేష్, కె.మహేష్, ఆర్.లక్ష్మణమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, కె.సంతోషం, బి.లక్ష్మి, జి.మణి, ఆర్.విమల, జి.రాంబాబు, డి.వెంకటరమణ, ఎల్.బంగారునాయుడు, ఎ.లోకేశ్వరరావు పాల్గొన్నారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

వరి తెగుళ్లతో రైతుల్లో ఆందోళన

వార్త 3లో..

కొయ్యూరు జెడ్‌పిటిసి హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్టు

వార్త 3లో..

యూరియా కోసం పడిగాపులు

వార్త 7లో..

మాట్లాడుతున్న నాగశేషు

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగశేషు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, అదనపు యాప్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్‌లో ప్రభుత్వ ఉద్యోగులు అన్న పదాన్ని తొలగించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగ శేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా రెండో మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా నాగశేషు హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గడిచిన ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా ప్రభుత్వం తీవ్ర ఆర్థిక దోపిడీకి పాల్పడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ పథకాన్ని మిగతా 2లో..

వ్యర్థాల పారబోతపై నిరంతర నిఘా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగర వ్యాప్తంగా వ్యర్థాల పారవేయడాన్ని నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలు, కృత్రిమ మేధస్సు (ఎఐ) సాంకేతికత ద్వారా నిత్య పర్యవేక్షణ జరుగుతోందని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. డ్రోన్ల ద్వారా సేకరించిన దృశ్యాలను సిటీ ఆపరేషన్ సెంటర్ (సిఒసి)లో ఎఐ సహాయంతో విశ్లేషిస్తున్నామని, ఆ ఆధారంగా జివిఎంసి 'షీ' టీమ్స్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నాయని, జరిమానాలు విధించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. బుధవారం రాత్రి నాలుగో జోన్ పరిధిలోని పూర్ణా మార్కెట్ నుంచి కనకమహాలక్ష్మి ఆలయ జంక్షన్ వరకు డ్రోన్, ఎఐ ఆధారిత పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో టౌన్ కొత్త రోడ్డు నుండి కనకమహాలక్ష్మి ఆలయం వరకు ఉన్న ఫుట్‌పాత్‌ల వెంట అధికంగా వ్యర్థాలు పేరుకుపోయినట్లు గమనించామని, ఆ ప్రాంతంలోని దుకాణదారులలో చాలామంది డస్ట్‌బిన్లు వినియోగించకపోవడం గుర్తించామని తెలిపారు. ఇష్టానుసారంగా వ్యర్థాలను పారవేస్తున్న వారిపై మిగతా 2లో..

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

'మధ్యాహ్న భోజనం' నాణ్యత లోపిస్తే చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిఎమ్ పోషన్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో క్వాలిటీ, క్వాంటిటీలలో అధికారులు ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. ఎంపిడిఒలు, హెడ్మాస్టర్లు, ఇతర అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. బిసి, ఎస్‌సి హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

ప్రజల్లో గొప్పగా చెబుతూ, దాంట్లో పనిచేస్తున్న అంగన్వాడీలకు మాత్రం తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వేతనాల పెంపుదల కోసం పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం దేశానికి ఆదర్శమని తెలిపారు. 2023లో జరిగిన 42 రోజుల చారిత్రాత్మక సమ్మె ఫలితంగా సాధించిన 8 జిఒలతోపాటు వేతనాల పెంపుదలకు మరో చారిత్రక పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. విశాఖ జిల్లాలో జరగబోతున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహాసభలో 32 మందితో జిల్లా కమిటీ, 19 మందితో నూతన కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎల్.దేవి, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటలక్ష్మి, కోశాధికారిగా ఆర్.శోభారాణి, గౌరవ అధ్యక్షులుగా పి.మణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.పద్మావతి, అడిషనల్ జనరల్ సెక్రెటరీగా కె.బృందావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.ఈశ్వరమ్మలను ఎన్నుకున్నారు.

'మధ్యాహ్న భోజనం' నాణ్యత లోపిస్తే చర్యలు

భోజనం అందిస్తున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. వైద్యాధికారులు స్కూల్స్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అవసరమైన ఐరన్ టాబ్లెట్స్‌తో పాటు అవసరమైన వారికి ఇతర మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారుల సమన్వయంతో విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలన్నారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని డిఎం సివిల్ సప్లై అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నాణ్యమైన వెజిటబుల్స్ సేకరించాలని, మెనూ ప్రకారం భోజనాన్ని తయారు చేసి పిల్లలకు అందించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే కోడిగుడ్లకు మొదటి వారంలో నీలం రంగు స్టాంపును, రెండో వారంలో పింకు రంగు స్టాంపు, మూడో వారంలో పచ్చ రంగు స్టాంపు, నాలుగో వారంలో బ్రౌన్ కలర్ స్టాంపును వినియోగించాలన్నారు. బియ్యం, కూరగాయలు, ఇతర వస్తువులను నిలువ చేసే రూముల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు ప్రతిరోజూ అందిస్తున్న భోజన వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు, డిఎస్ఒ భాస్కర రావు, పిడిడి ఆర్‌డిఎ లక్ష్మీపతి, ఎఫ్‌సిఐ, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాల పారబోతపై నిరంతర నిఘా

భారీ జరిమానాలు విధించడం, ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందన్నారు. నగర పరిశుభ్రతను కాపాడటంలో వ్యాపారులు, ప్రజల సహకారం అత్యంత అవసరమని స్పష్టంచేశారు.

రాజయ్యపేట మత్స్యకారులకు అండగా నిలుస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ నక్కపల్లి మండలంలో రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. గురువారం ఆసీలుమెట్టలోగల పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, మత్స్యకార నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి మత్స్యకారునిగా తన వాళ్లు ఎక్కడ ఉన్నా అండగా ఉంటానని భరోసానిచ్చారు. నక్కపల్లిలో వందలాది మంది పోలీసులను దించడం కూటమి సర్కారు సిగ్గుమాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దారులన్నీ దిగ్బంధం చేయడం దారుణమన్నారు.

స్కోడా బుకింగ్స్‌కు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ స్కోడాకు చెందిన నూతన వాహనం స్కోడా ఒక్టవి ఆర్‌ఎస్ ఫ్రీ బుకింగ్స్‌కు విశేష స్పందన లభిస్తోందని ఫ్రీ బుకింగ్ మొదలైన 20 నిమిషాల్లోనే మొత్తం స్టాక్ బుక్ అయిందని సంస్థ బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. గురువారం ఉదయం విశాఖలోని స్కోడా షోరూంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో స్కోడా 25 ఏళ్ల సంబరాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ వాహనాన్ని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ వాహనం 2.0 ఇఎస్ఐ టర్బో చార్జ్ పెట్రోల్ ఇంజిన్ కలిగి 195 కెడబ్ల్యు పవర్‌ను అందిస్తుందని, 370 ఎన్ఎం టార్కులు ఉత్పత్తి చేస్తుందని, 7 స్పీడ్ డిఎస్‌డి ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ సహాయంతో కేవలం 6.4 సెకండ్లలోనే కారు వేగం 0 - 100కు చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఈ వాహనం డెలివరీలు నవంబర్ 6 నుండి ప్రారంభమవుతాయని, వాహనం ప్రారంభ ధర రూ.49,99,000గా ఉందని ఆయన తెలిపారు.

వేపగుంట టిడిఆర్‌పై ఆరోపణలు సరికావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేపగుంట గ్రామం సర్వే నెంబర్ 77/10 ఎలో ఉన్న భూమిని జివిఎంసి మాస్టర్ ప్లాన్, మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం తీసుకుంటున్నారని, అందుకు పరిహారంగా నగదు కాకుండా టిడిఆర్‌లు ఇచ్చేందుకు జివిఎంసి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, ఆ భూమిపై తప్పుడు టిడిఆర్‌లు తీసుకోవడానికి కుట్ర జరుగుతోందని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఆరోపించడం సరికాదని భూ యజమానుల తరపున గారపాటి శరత్ చంద్ర అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ 1970లో ఈ భూమిని సదరం అప్పలనాయుడు నుంచి చందవాడ వీరభద్రరావు కొనుగోలు చేశారని, ఆ తర్వాత ఆయన చనిపోగా అతని వారసులకు భూమి దఖలు పడిందని చెప్పారు. అన్ని రకాల హక్కులు చట్ట పరంగా కలిగి ఉన్న ఈ భూములకు పరిహారంగా టిడిఆర్‌ల రూపంలో కుంభకోణం జరుగుతోందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న

మత్స్యకారులను సురక్షితంగా తీసుకొస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నుంచి బయలుదేరి బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నామని, వారిని తీసుకువచ్చే బాధ్యత తనదేనని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి బంగ్లాదేశ్ నేవీ అధికారులకు చిక్కిన బాధిత మత్స్యకార కుటుంబాలను ఆయన, నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం మాధవి ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న విశాఖ ఎపి మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం కలిసి సమావేశం నిర్వహించారు. విజయనగరం ఆర్‌డిఒ, టిడిపి దక్షిణ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్, మత్స్యకార నాయకులు కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో బందీలుగా ఉన్న మత్స్యకారులు గురించి కేంద్ర మత్స్యశాఖ మంత్రితో మాట్లాడానన్నారు. శుక్రవారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్‌ను స్వయంగా కలిసి మాట్లాడతానన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడవద్దన్నారు. వారిని ఇక్కడికి రప్పించడానికి సుమారు 60 రోజులు సమయం పట్టొచ్చని తెలిపారు. ఫిషరీస్ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

కెజిహెచ్‌లో నర్సు పోస్టుల భర్తీకి వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో ఖాళీగా ఉన్న 108 నర్సింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.రాజశేఖర్ రెడ్డి, ఎపి జిఇఎ నర్సింగ్ వింగ్ ప్రతినిధులు వి.ఉషాకుమారి, జైతు రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెజిహెచ్‌లో 34 హెడ్ నర్సు, 10 రెగ్యులర్ స్టాఫ్, 43 కాంటాక్ట్ నర్సింగ్ స్టాఫ్, ట్రామా కేర్‌లో 21 కాంటాక్ట్ నర్సింగ్ స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఇంత పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఉద్యోగులపై విపరీతమైన పని భారం పడుతోందని, రోగులకు అందించాల్సిన సేవల నాణ్యత తగ్గుతోందని తెలిపారు. సిబ్బంది కూడా తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని, ఒక్కొక్క హెడ్ నర్స్ 3 నుంచి 4 వార్డుల పర్యవేక్షణ చేయాల్సి వస్తోందని అన్నారు. తక్షణమే ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన విషయంపై డిఎంఇ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులతో మాట్లాడాలన్నారు.

శివరాత్రికి త్రిశూల్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కైలాసగిరిపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న త్రిశూల్ ప్రాజెక్ట్ వచ్చే జనవరి నెలాఖరుకు పూర్తి చేసి శివరాత్రి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాలని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. గురువారం ఉదయం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కైలాసగిరిలో త్రిశూల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. విశాఖ పర్యాటక అభివృద్ధిలో భాగంగా కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు.

సుమారు 65 అడుగుల మేర రూ 3.5 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న త్రిశూల్ నగరం నలుమూలల నుంచి కనిపిస్తుందని, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో జాయింట్ కమిషనర్ కె రమేశ్ , ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్ దుర్గా ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి నిరుద్యోగులకు

దుకాణాల కేటాయింపు కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఆధీనంలో ఉన్న ఆరు దుకాణాలను కేటాయించేందుకు ఎస్‌సి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, అధ్యక్షులు తరపున సంస్థ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పెదగంట్యాడ ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 5 షాపులు, సిరిపురం వుడా కాంప్లెక్స్‌లో ఒ షాపు కేటాయింపునకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుత స్థానిక మార్కెట్ విలువలో 50 శాతం నుండి 60 శాతం అద్దె ప్రాతిపదికన కేటాయింపు ఉంటుందని తెలిపింది. కేటాయింపు కాలం ఏడు సంవత్సరములు ఉంటుందని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఉన్న అద్దెలో 3 శాతం నుండి 5 శాతం పెంచుతామని, ఎంపికైన దరఖాస్తుదారులకు జిఒ ఎంఎస్ నెంబర్ 26 షరతులు వర్తిస్తాయని తెలిపింది.

షాపు కేటాయింపునకు ఎంపికైన వారు మూడు నెలల అద్దె సెక్యూరిటీ డిపాజిట్‌ను ఎస్సీ కార్పొరేషన్ వారికి డిడి రూపంలో చెల్లించాలని తెలిపింది. దరఖాస్తుదారులు విశాఖపట్నం జిల్లా వాస్తవ్యులై ఉండాలని, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి, కనీస విద్యార్హత టెన్త్ పాస్ అయి ఉండాలని పేర్కొంది. వయస్సు 25 నుండి 60 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపింది.

IN THE HONORABLE COURT OF JUNIOR CIVIL JUDGE AT SRUNGAVARAPUKOTA
O.S. 53/2016 IA 518/2024.

To
Dantuluri Uma Sundari
W/o D.V.K. Raju, 58 Years.
Residing @ gorapalli Residency
Flat No: 302, Side of Hawa
Mahal, Maharanipeta,
Beach Road Visakhapatnam.

ఇందు మూలముగా మీకు తెలియపరచునది ఏమనగా Smt. Bh. Hemachandra Prabha మరి ఇద్దరు rep. by వారి GPA. Holder Sri D.V. K.Raju గారు మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎస్.కోట O.S. 53/2016 అను దావాలో డాక్యుమెంట్ పిటిషన్ వేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు ఆక్షేపణలున్న **10-11-2025 ఉదయం 10.00,** మీరు గాని, వకీలు ద్వారాగాని కోర్టులో హాజరుంయి కోర్టు వారితో మనవి చేసుకోవలయును, లేని యెడల సదరు విషయంపై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురు అని తెలియజేయటమైనది.

S.B. NAGAMANI
ADVOCATE
VIZIANAGARAM
Cell : 9441792989

మహారాజశ్రీ గౌరవనీయులైన 13వఅదనపు జిల్లా జడ్జి మరియు సెషన్స్ కోర్టు
గాజువాక, విశాఖపట్నం
క్రిమినల్ అప్పీల్ నెం. 398 / 2023

బిట్వీన్:
పసుపులేటి సుధాకర్ . . . అప్పీలెంట్
మరియు:
తాలపర్తి అప్పలనాయుడు
. . . రెస్పాండెంట్-1

రెస్పాండెంట్-1కు నోటీసు

రెస్పాండెంట్-1:
తాలపర్తి అప్పలనాయుడు,
తండ్రి పైడన్న, డో.నెం. 3-3-31/2,
గుడివాడ అప్పన్నకోలనీ, మింది,
బి.హెచ్.పి.వి.పోస్టు, విశాఖపట్నం.

పై అప్పీలు పై అప్పీలుదారు వాజ్యము దాఖలు చేసినందున సదరు అప్పీలునకు మీరు రెస్పాండెంట్ అయినందున మీ వాజ్యము తెలుపుటక లేదా ప్రత్యుత్తరము తెలియ పరచుటకు **తేది:10-11-2025 తారీఖున ఉదయం 10-30 గంటలకు** స్వతహాగా కానీ లేక సరయిన భోగట్టా ఇవ్వబడిన వకీలుగారి ద్వారా ఈ కోర్టులో హాజరు అయ్యేటట్లు ఇందు మూలముగా మీకు ఆజ్ఞాపించడమయినది. పైన చెప్పబడిన దినమున మీరు హాజరు కానిచో మీకు పై అప్పీలులో మీకు వాదన లేదని భావించి మీ పరోక్షమందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించుట జరుగునని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 10-11-2025
కలపాల శ్రీనివాసరావు
అడ్వకేట్, డో.నెం. 10-50-20,
ప్లాట్ నెం. 303, సిరిపురం
విశాఖపట్నం-530003

మహారాజశ్రీ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ యలమంచిలి వారి కోర్టులో
యస్.నెం. 30 / 2019

మధ్యన:
బండారు రత్నం మరియు ఇతరులు
. . . వాదులు
మరియు:
బండారు వరహాలు మరియు ఇతరులు
. . . ప్రతివాదులు
టు:
18. కురెళ్ళ శైలజ, D/o. అప్పారావు,
సాయినగర్, తునిటౌను, కాకినాడ జిల్లా.
19. బొడ్డ సుబ్రమణ్యం, S/o. అప్పారావు,
సాయినగర్, తునిటౌను, కాకినాడ జిల్లా.

ప్రచురణ

పై నెంబరు దావాలో ప్రతివాదులు నెం.18 మరియు 19లకు పలుపర్యాయములు కోర్టు ద్వారా సమన్లు పంపించిననూ సదరు ప్రతివాదులు నెం.18 మరియు 19లకు పర్సనల్‌గా సర్వేకావటం లేదు. సదరు కారణంగా పైకోర్టువారు తేది: 15-10-2025ని పేపర్ పబ్లికేషన్ ద్వారా పై ప్రతివాదులు నెం.18 మరియు 19లకు జనరల్ నోటీసునకు ఆర్డరు వేసియున్నారు. సదరు ప్రతివాదులు నెం. 18 యు 19లకు ఏమైనా ఆక్షేపణలున్నచో పైకోర్టు వారి ఎదుట **తేది:14-11-2025దిన ఉదయం 10-30 గంటలకు** హాజరై తమయొక్క ఆక్షేపణలు తమరుగాని, తమ వకీలు ద్వారా గాని తెలియ చేయవలెను. లేనియెల మీకు పరోక్షముగా తీర్మానం చేయబడును.

యస్.వి.ఎ.ప్రసాదు, అడ్వకేట్, రామ్‌నగర్, యలమంచిలి మున్సిపాలిటీ, అనకాపల్లి జిల్లా. సెల్: **7893802452**

ముగిసిన డివిజనల్ స్థాయి క్రీడా పోటీలు

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఆనందపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆనందపురంలో మూడు రోజులుగా జరిగిన భీమునిపట్నం డివిజనల్ స్థాయి బాలురు, బాలికల క్రీడా పోటీలు గురువారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలతో ముగిశాయి. పోటీలలో అండర్-17, అండర్-14 విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు 750 మంది, రెండవ రోజు 750 మంది, మూడవ రోజు 200 మంది మొత్తం 1,700 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు బహూకరించారు. డివిజనల్ స్థాయిలో విజేతలైన క్రీడాకారులకు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. శుక్రవారం జరగాల్సిన జిల్లా స్థాయి పోటీలు వాతావరణ పరిస్థితుల కారణంగా వాయిదా పడినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడల నిర్వహణలో ఆనందపురం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి, డివిజన్ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులు, ఆనందపురం పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిస్కస్‌త్రోలో కస్తూర్బా బాలికల ప్రతిభ

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో నియోజక వర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్‌త్రోలో స్థానిక కస్తూర్బా బాలికలు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ గంగా కుమారి గురువారం తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.కావ్యప్రియ డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని పి.కల్యాణికీర్తి తృతీయ స్థానం, 1500 మీటర్ల పరుగు పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఇ.తిరుపతి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థినులతోపాటు పిఇటి వరలక్ష్మిని ప్రిన్సిపల్ అభినందించారు.

క్రీడా పోటీల్లో గెలుపొందిన బాలికలతో ప్రిన్సిపల్ గంగాకుమారి

నేటి జిల్లా స్థాయి క్రీడా పోటీలు వాయిదా

ప్రజాశక్తి- ఆనందపురం : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆనందపురం పిఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగాల్సిన అండర్-17 కబడ్డీ, ఖోఖో పోటీలు వాతావరణం అనుకూలంగా లేక వాయిదా వేసినట్లు ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, క్రీడల ఇన్‌ఛార్జి బుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మైదానం తడిగా ఉండటంతో క్రీడలు నిర్వహించడానికి అనువుగా లేదని పేర్కొన్నారు. ఈ కారణంగా పోటీలు తాత్కాలికంగా వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో పందూరు గ్రామంలో గురువారం విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి చెందాడు, పందూరు శివారు బంద గ్రామం నుంచి మోటిపల్లి గీతకృష్ణ(22) అశోక లేలాండ్ మినీ వ్యాన్ డ్రైవింగ్ చేసుకుని వస్తూ ఉండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది ఈ ఘటన విద్యుత్ వైరు వాహనంపై పడడంతో గీతాకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు, మృతునిది కృష్ణాజిల్లా పెడన మండలం, ముచ్చర్ల గ్రామం కాగా 73 రిసార్ట్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో జి జగన్నాధపురం గ్రామానికి చెందిన జల్లారి సుదర్శనరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. గురువారం బైక్‌పై తుని వైపు వెళుతుండగా గొడిచెర్ల జాతీయ రహదారిపై వెనక నుండి వస్తున్న లారీ ఢీకొనడంతో సుదర్శనరావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ ఐ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు వెల్లడించారు.

కొయ్యూరు జెడ్‌పిటిసి హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి

ప్రజాశక్తి- రోలుగుంట: కొయ్యూరు జెడ్‌పిటిసి వారా నూకరాజు హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి తెలిపారు. గురువారం ం ో ల ు గ ు ం ట పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, ఈనెల 20నఉదయం 11 గంటలకు కొయ్యూరు జెడ్‌పిటిసి వారా నూకరాజు కొనుగోలు చేసిన సర్వే నెంబరు 139లోని 10.83ఎకరాల భూమిలో కూలీలతో వెళ్లి తుప్పలు తొలగించే పనులను పరిశీలించేందుకు వెళ్లగా, ప్రత్యర్థి వర్గం కేదారి రాజుబాబు, వారి బంధువులు పథకం ప్రకారం పొలంలోనే కర్రలు, కత్తులతో దాడికి యత్నించగా, అక్కడున్న వారంతా పారిపోగా, వారంతా నూకరాజును చుట్టుముట్టి దాడి చేయగా కరాజు పొలంలోనే రక్త గాయాలై మృతి చెందారన్నారు. నూకరాజుతో పాటు వచ్చిన మాస లోవరాజు అనే వ్యక్తిపై కూడా దాడి చేయగా అతని చేతికి గాయమైందన్నారు. అందిన సమాచారం మేరకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రోలుగుంట పోలీసులు, సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. అన్ని సాక్ష్యాలను సేకరించిభూతగాదాలు కారణంగా పథకం ప్రకారమే నూకరాజును హత్య చేసినట్టు నిర్ధారించారు. బుధవారం మధ్యాహ్నం కళ్లాలు పాకలు వద్ద సంచరిస్తున్న నిందితులను కొత్తకోట, రోలుగుంట ఎస్ఐలు సిబ్బందితో వెళ్లి అదుపులో తీసుకొని అరెస్టు చేశారన్నారు. అరెస్టు అయిన వారిలో కేదారి రాజుబాబు, నీలాపు అప్పలనాయుడు, నీలాపు లక్ష్మణరావు, నీలాపు అప్పలనాయుడు, నీలాపు యరకన్న, కేదారి రాజేశ్వరి, ఈదెల రాజేశ్వరి ఉన్నారన్నారు. కేసును మరింత లోతుగా విచారిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న సాయిబాబా

136 సార్లు రక్తదానం

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి సాగర్‌నగర్‌కు చెందిన బేతా సాయిబాబా నగరంలోని ఎఎస్ రాజా వాలంటరీ రక్తదాన కేంద్రంలో ఇప్పటి వరకు 136వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సెలెన్స్ అవార్డు' పేరుతో ధ్రువపత్రం అందించి అభినందించారు. 30 ఏళ్ల క్రితం సాయిబాబా తండ్రికి రక్తం అవసరమైనపుడు పడిన అవస్థలు ప్రత్యక్షంగా అనుభవించిన ఆయన నాటి నుంచి రక్తం దానం చేయడం అలవాటుగా చేసుకున్నారు. 19 ఏళ్ల వయసులోనే రక్త దానం చేయడం ఆరంభించారు. రక్తదానం చేశాక ఇంత వరకు తనకెలాంటి సమస్యలు ఎదురుకాలేదని రక్తదాత సాయిబాబా పేర్కొన్నారు. మరణానంతరం కళ్లు, అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యుల అంగీకారంతో ఓ వైద్యసంస్థకు మూడేళ్ల క్రితమే అంగీకారపత్రం ఇచ్చానని తెలిపారు.

వేడుకగా తిరునక్షత్ర పూజలు

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీనసింహ స్వామి ఆలయంలో గురువారం తిరు నక్షత్ర పూజలను ఆలయ స్థానాచార్యులు టిపి.రాజగోపాల్ ఆధ్వర్యాన వైభవంగా నిర్వహించారు. నాలాయిరి దివ్య ప్రభంద పారాయణం సేవ జరిపించారు.

వరి తెగుళ్లతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి -పద్మనాభం : ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలోని వరి పంటకు వివిధ రకాల తెగుళ్ల సోకడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. మద్ది, బికె.పాలెం, బిహెచ్.పురం, గంగవరం, అనంతవరం తదితర గ్రామాల్లో వరిలో ఎర్రగా వచ్చి ఎదుగుదల ఆగిపోయి పంట పూర్తిగా పోయినట్లు కనిపిస్తోంది. వరి పంట ఉడిచిన నెల రోజులు తర్వాత చేను మట్ట కట్టిందని మరి కొంతమంది రైతులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అగ్గి తెగులు, పాసి పురుగు, దోమ పోటు, ఎలుకల బెడద విపరీతంగా ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. పాసిపురుగు వంటి తెగుళ్లను అరికట్టడం కోసం మెట్ట ప్రాంత రైతులు నీటిని నిలిపేస్తే ఎలుకలు పెరిగి వరి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అగ్గి తెగులు నివారణ కోసం 2 నెలల కాలంలో ఒక్కో రైతు రెండు నుంచి నాలుగు సార్లు మందులు పిచికారి చేసినప్పటికీ వరి పంటలో ఎటువంటి ఫలితాలు లేవని, దీనివల్ల ఈ ఏడాది ఎకరానికి రూ.25వేలు ఇప్పటికే ఖర్చు అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 90 ఎకరాల్లో తెగులు ఆశించిందని వికె.పాలెంలో మీసాల అర్జున, ఈశ్వరరావు, బాయ్ శ్రీను, ఆర్.సూర్యనారాయణ, బోనె అప్పలనాయుడు, శ్రీను, మద్ది గ్రామంలో కాళ్ల సూరి, సన్యాసినాయుడు, గాడు సన్నిబాబు, గాడు సూరిబాబు కనకాల బంగారు నాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగులు సోకి పాడైన వరి పంట

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -పద్మనాభం : గ్రామస్థాయిలో ప్రజలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కె.రూపేష్ చెప్పారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులకు, లైన్‌మ్యాన్‌లకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన మండలానికి సోలార్ విద్యుత్ వినియోగంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం రావాలని కోరారు. లైన్‌మ్యాన్, గ్రామ కార్యదర్శులు సంయుక్తంగా పనిచేసి సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో పగటిపూట వీధిలైట్లు వెలుగుతున్నాయని, బాధ్యతగా వాటిని ఆపే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడి రాజశేఖర్, ఎఇ జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

చోరీ ఫిర్యాదుపై స్పందన కరువు

ప్రజాశక్తి- కొమ్మాది : కొమ్మాది భోయపాలెం సాయిరామ్ కాలనీలోని సాయినగర్ అపార్ట్‌మెంట్‌లో సెప్టెంబర్ 5వ తేదీ తెల్లవారుజాము 3గంటలకు సైకిల్ చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని బాధితుడు నరసింహరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇద్దరు వ్యక్తులు బైక్ మీద వచ్చి ఒకరు లోపలికి ప్రవేశించి సైకిల్ తీసుకొని వెళ్లిపోయిన ఘటన సిసి కెమెరా రికార్డు చేసిందని, ఆ పుటేజీతో ఆనందపురం క్రైమ్ ఎస్ఐకి ఫిర్యాదు చేశామని, వారు మిగిలిన సిసి కెమెరాలను పరిశీలించి తరువాతి రోజు తమ పరిధి కాదని, పిఎం.పాలెం స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని చెప్పారని బాధితుడు చెప్పారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎవరూ స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిసి పుటేజీ ఆధారంగా పరిశీలించి చోరీ నిందితులను పట్టుకొని తనకు న్యాయం చెయ్యాలని నరసింహరాజు కోరుతున్నారు.

సఖీ సురక్షపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

సఖీ సురక్షపై అవగాహన

ప్రజాశక్తి- భీమునిపట్నం : మహిళల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సఖీ సురక్ష పథకంపై గురువారం జివిఎంసి 3వ వార్డు పరిధి తోట వీధి వార్డు సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పథకం ప్రాధాన్యతను వివరిస్తూ వైద్య, ఆరోగ్య సిబ్బంది స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నూకరాజు, మాజీ కౌన్సిలర్ కుప్పిలి దుర్గ, యుసిడి ఎపిడి దొర తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న రఘురామకృష్ణరాజు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.8,99,123 చెక్కులను బాధితులకు ఏపి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పి.విష్ణుకుమార్ రాజు గురువారం ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కొంత లబ్ధి చేకూరుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆహార పదార్థాలు కల్తీ జరిగితే సహించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, దీనిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల దీపికా, ఉష్శ్రీ, ఆళ్ల లీలావతి, కంటిపాము కామేశ్వరి, కంపా హనూక్, సుజాత, అరుణ్ బాబు, రాంబాబు, ఆశీర్వాదం, దివాకర్, ముత్యాల నాయుడు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి సమితి మాజీ ఉపాధ్యక్షులు రాములు మృతి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన భీమిలి సమితి మాజీ ఉపాధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త ఎస్.రాములు (98) గురువారం మృతిచెందారు. రాములు 1976 నుంచి 1981 వరకు రెడ్డిపల్లి సర్పంచ్‌గా, 1981 నుంచి 1987 వరకు కొంత కాలం ఉప సర్పంచ్‌గా, మిగిలిన కాలం సర్పంచ్‌గా, ఇదే కాలంలో భీమిలి సమితి ఉపాధ్యక్షులుగా పనిచేశారు. తర్వాత 1989 నుంచి 1995 వరకు మళ్లీ రెడ్డిపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. రాములు అంత్యక్రియలను శుక్రవారం గ్రామంలో నిర్వహించనున్నారు.

ఎపి ఐవిఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శిగా మహేష్

ప్రజాశక్తి -గాజువాక : ఆంధ్రప్రదేశ్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) అదనపు ప్రధాన కార్యదర్శిగా కారుమూరి మహేష్ నియామితులయ్యారు. ఈ పదవి కేటాయించిన ఎపి ఐవిఎఫ్ అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గొంట్ల మోహనరావుకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

ప్రజాశక్తి- పెందుర్తి : ఆక్రమణకు గురవుతున్న పార్కు స్థలాన్ని కాపాడాలని కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు క్యాంపు కార్యాలయంలో 98వ వార్డు పరిధిలోని షిప్‌యార్డు కాలనీ వాసులు గురువారం వినతి పత్రం అందజేశారు. ది హిందుస్థాన్ షిప్ యార్డ్ లే-అవుట్‌కు సంబంధించిన పార్క్ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు బయట వ్యక్తులు కంటైనర్ ఏర్పాటుచేశారని, దీన్ని తొలగింపజేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత కంటైనర్‌ను వెంటనే తొలగించాలని జివిఎంసి, పోలీస్ అధికారులను ఆదేశించారు.

కెజిబివి విద్యార్థినులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి గొల్లలపాలెంలో ఉన్న కెజిబివి 10,11,12 తరగతుల విద్యార్థినులకు పలు అంశాలపై సమగ్ర శిక్ష రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎంఎస్ కరియప్ప గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మంచిగా ఆలోచించాలని, సానుకూల దృక్పథం కలిగి ఉండాలని, ఒత్తిడికి గురి కాకూడదని, ఏకాగ్రత కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ శ్రీదేవి, ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాక సమగ్రాభివృద్ధికి కృషి : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పారు. జివిఎంసి 72 ,76 వార్డుల పరిధిలో రూ.8 కోట్లతో మౌలిక సౌకర్యాలు, జగ్గుసెంటర్ కూడలి నుంచి వై.జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, 72, 76 వార్డుల కార్పొరేటర్లు ఎజె.స్టాలిన్, గంధం శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కోట్లాది రూపాయల జివిఎంసి నిధులతో గాజువాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. శ్రీనగర్‌లో రూ.50 లక్షలతో, నాయుడోరు వీధికి రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ గోవిందరావు, ఇఇ రాయల్‌బాబు, డిప్యూటీ ఇఇ ఎంఆర్ఎస్.అప్పారావు, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు ఎ.లక్ష్మణరావు, కరణంరెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు, జి.ఆనంద్, ఎ.విష్ణుమూర్తి, ప్రసాదుల శ్రీనివాస్, సిరసపల్లి బాబూరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

వైసిపి లిక్కర్ స్కామ్‌ను కూటమిపై నెట్టే యత్నం

ప్రభుత్వ విప్ గణబాబు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : వైసిపి ప్రభుత్వంలో అతిపెద్ద కుంభకోణమైన లిక్కర్ స్కామ్‌ను ఆ పార్టీ కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వ విప్ గణబాబు ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి తమ అక్రమాలు, పాపాలను దాచుకునే ప్రయత్నంలో జగన్ అండ్ కో తాడేపల్లి ప్యాలెస్ నుంచే కల్తీ మద్యం ఫార్ములాను తయారు చేసుకున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో రూ.3500 కోట్ల మద్యం కుంభకోణం చేసి, ఇప్పుడు ఆ పాపాలను ప్రస్తుత ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో జరిగిన తాజా కల్తీ మద్యం ఘటన కూడా ఈ కుట్రలో భాగంగానే జరిగిందన్నారు. సెప్టెంబర్ 24న ఆఫ్రికా వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్దనరావును 23న జోగి రమేష్ ఇంటికి పిలిపించుకోవడం యాదృచ్ఛికం కాదన్నారు. జోగి రమేష్, జనార్దనరావు చిన్ననాటి స్నేహితులు అని, కల్తీ మద్యం వ్యాపారానికి వీళ్లిద్దరి ప్రణాళికే ఈ ఆధారం అని పేర్కొన్నారు. మద్యం కుంభకోణం ద్వారా విదేశాల్లో మనీ లాండరింగ్ జరిగిందని, దుబాయ్, ఆఫ్రికాలో భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు. 2013లో ఆఫ్రికాలోని కామరూన్ దేశంలో రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరుతో సునీల్ రెడ్డి, అనిల్‌రెడ్డి కల్తీ మద్యం వ్యాపారం జరిపారని, ఆ కంపెనీని అక్కడి ప్రభుత్వం సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఇద్దరూ జగన్‌రెడ్డి బినామీలు కాదా అని ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పిఎల్ఆర్ ప్రాజెక్ట్స్ కంపెనీకి కల్తీ మద్యం వ్యాపార లావాదేవీల్లో రూ.5 కోట్లు జమ అయినట్లు సిట్ నివేదికల్లో తేలిందన్నారు.

కల్తీ మద్యం అంశంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాజీ లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే అనేకమందిని అరెస్ట్ చేసి, నలుగురు ఐపిఎస్ అధికారులతో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేశామని చెప్పారు. అదే సమయంలో వినియోగదారుల భద్రత కోసం ప్రతి మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ద్వారా ఎవరైనా స్కాన్ చేసి అది కల్తీదా కాదా తెలుసుకోవచ్చని వివరించారు. ఈ సమావేశంలో కూటమి నేతలు నారిపిన్ని సత్తిరాజు, కంపరదిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై ఆందోళన

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తమ బిడ్డ మృతి చెందిందంటూ బంధువులు గురువారం ఆందోళన చేశారు. బాధితుల కథనం ప్రకారం... పెదగంట్యాడ నడుపూరు ప్రాంతానికి చెందిన మహిళ నెలలు నిండటంతో గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆస్పత్రిలో చేరింది. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో ఫోన్‌లో డాక్టర్లను సంప్రదించి నర్సులే ప్రసూతి చికిత్స అందించారు. ఉదయం 10:30 గంటల వరకు డ్యూటీ డాక్టర్ పేషెంట్ వద్దకే వచ్చి పలకరించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రసవం అయిన సమయంలో పాప బాగానే ఉందని చెప్పిన డాక్టర్లు కాసేపటి తర్వాత హడావిడి చేసి పాప బతకలేదని తెలిపారని, ఇదంతా డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని గర్భిణి భర్త ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన భార్యను టెస్టులు చేయాలంటూ ఇబ్బందులకు గురి చేశారని చెబుతున్నారు. వైద్యుల నిర్లక్ష్యంపై దువ్వాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆమెకు నెలలు నిండి 17వ తేదీ డేట్ ఇచ్చినప్పటికీ వారం, వర్జ్యం చూసుకొని ఆలస్యం చేశారని, అందువల్లనే ఉమ్మ నీరంతా పోయిందని వైద్యులు చెబుతున్నారు. దానివల్లనే డెలివరీ సమయంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఆఖరి వరకు ప్రయత్నించినప్పటికీ డెలివరీ జరిగినా పాపని బతికించలేకపోయామని చెబుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఇవి.వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, దేవస్థానం పిఆర్ఒ నాయుడు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

రాధాకృష్ణ మహోత్సవాలకు తరలిరండి

ప్రజాశక్తి- ములగాడ : నగరంలో నవంబర్ 5వ తేదీన జరిగే రాధాకృష్ణ మహోత్సవాలకు యాదవ సోదరులందరూ తరలిరావాలని కోరుతూ ప్రతిభ పాఠశాల ప్రిన్సిపల్ తోనంగి వెంకటరమణి ఆధ్వర్యంలో 59వ వార్డు పరిధి కొత్త నక్కవానిపాలెంలోని యాదవ మహిళలను ఆహ్వానించారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవర ఈశ్వరియాదవ్, ఏదురు అనురాధ యాదవ్, మేల్లి రాజేశ్వరి యాదవ్ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి: బొండా

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధిలోని పార్కుల అభివృద్ధికి కృషిచేస్తానని కార్పొరేటర్ బొండా జగన్నాథం తెలిపారు. వార్డు పరిధిలో అభివృద్ధికి నోచుకోని కొన్ని పార్కులను హార్టికల్చర్ ఎడిహెచ్‌తో కలిసి బొండా జగన్నాథం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ, నిర్వాసిత కాలనీలు ఏర్పడి సుమారు 35 సంవత్సరాల పైబడిందని, నేటికీ పార్కులకు కేటాయించిన స్థలాలు అభివృద్ధి చెందలేదని తెలిపారు. ఈ పార్కుల్లో పిల్లల ఆట పరికరాలు, వృద్ధులు, పెద్దలకు వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం జివిఎంసి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎడిహెచ్ స్పందిస్తూ ఈ పార్కులకు ఎస్టిమేషన్ వేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రాజన్‌రాజు, విశ్వేశ్వరరావు, సన్యాసిరాజు, బివిఆర్.రాజు, ఎస్.రామరాజు పాల్గొన్నారు.

ఎడిహెచ్‌తో కలిసి పార్కులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొండా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

కె.కోటపాడు : విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు మండల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడ సబ్ స్టేషన్ పరిధిలోని చౌడువాడ, మల్లంపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి, చింతపాలెం, గొండుపాలెం గ్రామాలలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎం.అలమండ, కొత్తపెంట, ములకలపల్లి, జగన్నాథపురం, గవరవరం, వేచలం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ కె.శంకరరావు తెలిపారు.

మునగపాక : మునగపాక సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నాగులపల్లి, ఉమ్మలాడ, ఒంపోలు, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, పాత నాగవరంతోపాటు మరికొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రావికమతం: రావికమతం, కొత్తకోట, తట్టబంద సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 24న శుక్రవారంఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ ఎవిఎస్ఎం అప్పారావు, ఎఇ శ్రీనివాసరావు తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో యార్డ్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ అప్పలనాయుడు తెలిపారు. ఈ కారణంగా వేములవలస, ఎల్‌వి.పాలెం, ఆనందపురం, సత్యకల్యాణి అపార్ట్‌మెంట్, బిసి.కల్లాలు, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, మెట్టమీదపాలెం, గుడిలోవ, వెల్లంకి, పెద్దిపాలెం, పొడుగుపాలెం, కుసులవాడ, జగన్నాథపురం, వెంకటాపురం, చందక, గొట్టిపల్లి, తర్లువాడ, నగరంపాలెం, పందలపాక, బాకురుపాలెం, ఇచ్ఛాపురం, చిన్నయ్యపాలెం, రామునాయనిపేట, రేగనిగూడెం, ముకుందపురం కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సిజెఐ గవాయ్‌పై దాడి సిగ్గుచేటు

ప్రజాశక్తి-అనకాపల్లి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై బూటుతో దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిద్దాం – భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశంపై సిపిఐ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో న్యాయవాది రాకేష్ కిషోర్ ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం ప్రజాస్వామ్యంలో క్షమించరాని నేరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జరిగిన సంఘటనపై సక్రమంగా స్పందించకపోవడం బాధాకరమన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ దొరబాబు మాట్లాడుతూ మతం పేరుతో ఆర్ఎస్ఎస్ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కే మోహన్‌రావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఉత్సవాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెళ్ళకపోవడం వల్లనే ఈ సంఘటన పాల్పడ్డారని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేత కొలతల హరినాథ్ బాబు మాట్లాడుతూ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహిస్తే పాలకులు మారే అవకాశం ఉందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి పరమేశ్వరి మాట్లాడుతూ మోడీ హయాంలో దళితులపై విపరీతమైన దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వియ్యపు రాజు, విత్తనాల పోతురాజు, మునగపాక సత్తిబాబు, కోరబిల్లి శంకర్రావు, ఎన్ సత్యనారాయణ, పప్పల ఈశ్వరరావు ముత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకరరావు

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా యూనియన్ నాయకులు

ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభల గోడపత్రిక గురువారం చోడవరంలో ఆవిష్కరించారు. నవంబర్ 8, 9 తేదీల్లో ఈ మహాసభ జరుగుతుందని పేర్కొన్నారు. ఆశా వర్కర్స్ 26 జిల్లాల నుండి 300 మంది ఆశా యూనియన్ నాయకులు మహాసభకు హాజరుకానున్నారని తెలిపారు. మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు దిశా, నిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఆశాలపై పని భారం విపరీతంగా పెరిగిందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా కార్యకర్తలను పెంచాలని, రాజకీయ జోక్యాన్ని నివారించాలని రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె వరలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు తార, ఆర్.సంతోషి, బొదాన లక్ష్మి, టి గౌరీ పాల్గొన్నారు.

28 నుంచి జిల్లా పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి నవంబర్ 5 వరకు నిర్వహించే అనకాపల్లి జిల్లా బుక్ ఫెస్టివల్‌ను పుస్తక ప్రియులు, పాఠకులు విజయవంతం చేయాలని జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి కోరారు. ఈ మేరకు గురువారం అనకాపల్లి పుస్తక మహోత్సవ పోస్టర్ జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మనిషి ఆలోచనలను విస్తరింపజేస్తాయని, సమాజం అభివృద్ధికి చదువుతో పాటు పఠన సంస్కృతి అవసరమని తెలిపారు. అనకాపల్లిలో జరగబోయే పుస్తక మహోత్సవం ద్వారా విద్యార్థులు, యువత, సాహిత్యాభిమానులు విభిన్న రంగాల విజ్ఞానాన్ని పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని అందరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధి కిరణ్, బి ఉమామహేశ్వరరావు, జెవివి రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు రెడ్డి, ప్రజాశక్తి సర్క్యులేషన్ జిల్లా బాధ్యులు శంకర్ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌కు హాసిని ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : ఈ నెల 22న జరిగిన అనకాపల్లి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 విభాగంలో మండలంలోని వెదురుపర్తి జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన కె.హాసిని ప్రతిభ కనబర్చి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు ఎంపికైంది. ఈ మేరకు హాసినిని పాఠశాల హెచ్ఎం కెఆర్ఎస్.నాయుడు, స్కూల్ చైర్మన్ జి శివ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.నూకరాజు, గ్రామ పెద్దలు గురువారం అభినందించారు.

ఎంపికైన హాసిని

లా వర్సిటీతో అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డిఎస్ఎన్ఎల్‌యు)తో అమెరికాలోని ఈ క్యా ఫర్ పీస్ వరల్డ్‌వైడ్ యొక్క డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ గురువారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు లా వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. బావోద్వేగ మేధస్సు, అంతర్గత శాంతి, భారతీయ జ్ఞాన వ్యవస్థల రంగాలలో విద్యా సహకారాన్ని పెంపొందించడమే అవగాహన ఒప్పందం యొక్క లక్ష్యమని తెలిపారు. వర్క్‌షాప్‌లు, శిక్షణ సెషన్‌లు, ఇంటరాక్టివ్ అవగాహన కార్యక్రమాల ద్వారా వ్యక్తుల విద్యా, వ్యక్తిగత అభివృద్ధిని పెంపొందించడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మాదాసు విశ్వచంద్ర నాథ్, డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వైస్-ఛాన్సలర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు.

ఆహార భద్రతా నిబంధనలు పాటించని సంస్థలపై కేసులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆహార భద్రత నిబంధనలు అమలు చేయని వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేస్తామని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కె.సతీష్‌బాబు హెచ్చరించారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు గురువారం పట్టణంలోని ప్రముఖ వ్యాపార సంస్థను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలపరిమితి ముగిసిన కొన్ని ఆహార పదార్థాలను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం తనను కలిసిన విలేఖర్లతో సతీష్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులు నిశితంగా పరిశీలించాక ప్యాకేజ్ ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినియోగదారులను తప్పుదోవ పట్టించకుండా, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఎఫ్ఎస్ఎస్ఎఐ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆసకపల్లిలో ఉన్న గ్రేస్ మిరాకిల్ సెంటర్‌లో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ బుధవారం 30 మంది నిరుపేదలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. అల్పాహారం పెట్టి, ప్రయాణ ఖర్చులు ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ట్రెజరర్ పాసిల గోవిందా, మనోహర్ బ్రదర్ మ్యాథ్యూ, బ్రదర్ ఇస్సాక్, ఆకుల, స్వైలీ, దివ్య తేజ, బ్రదర్ మనోహర్, లాజరస్ ,జోషువా, జెరూష పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

అభినందన కార్యక్రమంలో పాల్గొన్న గురుకుల క్రీడాకారులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి గవర్నమెంట్ హైస్కూల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో తెనుగుపూడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్. విక్టర్ పాల్ గురువారం అభినందించారు. ఖోఖో, యోగా, వాలీబాల్, చెస్ పోటీల్లో విన్నర్స్‌గా, కబడ్డీలో రన్నర్స్‌గా గురుకుల విద్యార్థులు నిలిచారు. అథ్లెటిక్స్ విభాగంలో జస్వంత్, అశోక్, దినేష్, జగదీష్, తరుణ్ తదితరులు పలు విభాగాల్లో ప్రథమ స్థానాలు దక్కించుకున్నారు. విజేతలను అభినందించినవారిలో ఎస్ఎంసి చైర్మన్ ఇరట నరసింహమూర్తి, పీడీ ఉమామహేశ్వరరావు, పీఈటీ తరుణేశ్వరరావులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు...

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఈనెల 17, 18 తేదీలలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ మండల స్థాయి గేమ్స్‌లో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారని పాఠశాల హెచ్ఎం ఎస్.తిరుపతిరావు తెలిపారు. అండర్ 14 బాలురు విభాగంలో వాలీబాల్ మొదటి స్థానం, చెస్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలు, బాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో పోటీల్లో మొదటి స్థానాలు, అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్‌లో మొదటి, ద్వితీయ స్థానం, 100 మీటర్స్ పరుగులో ద్వితీయ, 200లో మొదటి, 400లో మొదటి, ద్వితీయ స్థానాలు, 600లో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. అండర్ 17 బాలుర విభాగంలో 800 మీటర్స్ డిస్కస్ త్రోలో మొదటి స్థానం, షాట్ పుట్ ద్వితీయ, చెస్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలు, బాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో మొదటి స్థానాలు, చెస్‌లో మొదటి, తతీయ స్థానాలు, అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్‌లో మొదటి, 100 మీటర్స్ పరుగులో మొదటి, 200లో ద్వితీయ, 400లో ద్వితీయ, 800లో మొదటి స్థానాలు సాధించినట్లు తెలిపారు. వీరంతా అనకాపల్లి డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ మేరకు గురువారం పాఠశాల హెచ్ఎం ఎస్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఆర్ ప్రసాద్, భాస్కరరావు , శ్రీనివాస్ , పాఠశాల చైర్మన్ శంకర్రావు, వైస్ చైర్మన్ జ్యోతిశ్రీ, ఎంఈఓలు లక్ష్మణరావు, ఎంజె రవీంద్ర బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు అబ్దుల్ రెహమాన్ విజేతలను అభినందించారు.

పతకాలు చూపుతున్న ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు

మానవ హక్కుల సంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం లక్ష్మీపురం రోడ్డులో ఏర్పాటు చేసిన జాతీయ మానవ హక్కుల సంఘం కార్యాలయాన్ని మానవ హక్కుల మండలి చైర్మన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నానాటికి మానవ హక్కుల హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల తరఫున హక్కులు కాపాడటం కోసం పోరాటం చేయవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల మండలి కార్యదర్శి మురళీ మోహన్‌రావు, ప్రముఖ వ్యాపార వేత్త ఎన్ గనిరెడ్డి, అనకాపల్లి జిల్లా ప్రతినిధులు మైచర్ల శ్రీనివాసరావు, దేవరపల్లి ఫణి, పి.ఆశా, పి.అబ్రహం, దేవరపల్లి నవకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో షెడ్ల నిర్మాణం

పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 1లో భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల జోరుగా సాగుతున్నాయి. ఇరువాడ ఎస్‌సి, బిసి కాలనీని ఆనుకోని ఉన్న ఆసకపల్లి కొండ మీద భూకబ్జాదారులు భూమిని చదును చేయడం, షెడ్లలు నిర్మించడం జరుగుతుంది. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి గాని, రెవిన్యూ అధికారులుగాని ఎటువంటి చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. విశాఖపట్నం మహానగరానికి కూత వేటు దూరంలో ఉన్న సబ్బవరంలో భూముల రేటు విపరీతంగా పెరిగిపోవడంతో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమించి చదును చేసి షెడ్లలు నిర్మిస్తున్నారు. దీనిపై తక్షణమే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

బొజ్జన్నకొండ వద్ద ఆర్టీసీ బస్సు హాల్ట్ కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్నకొండ జంక్షన్ వద్ద ఆ మార్గంలో రాకపోకలు సాగించే అన్ని ఆర్.టి.సి బస్సులకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సిద్ధార్ధ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం ఆర్‌టిసి ప్రధాన కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.హనుమశ్రీకి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్లానాగభూషణం మాట్లాడుతూ కార్తీకమాసం మొదలు నుండి సంక్రాంతి, మరుసటి రోజు కనుమతీర్థం వరకు కొన్ని వేలమంది బొజ్జన్నకొండ సందర్శనకు నిత్యం వస్తుంటారని తెలిపారు. బొజ్జన్నకొండ జంక్షన్ వద్ద హాల్టింగ్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, బొడ్డు సోమరాజు, ఊడా నాగేశ్వరరావు, బండి అప్పారావు, సాపల నూకరాజు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధికారులు

ఇన్ఫోసిస్‌కు డైట్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాల బి.టెక్ చివరి సంవత్సరం విద్యార్థులు ప్రముఖ ఐటి సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో ఎంపికయ్యారు. ఈ ప్రాంగణ నియామకాలను ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సహకారంతో నిర్వహించగా, డైట్ విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యం, శ్రద్ధతో పోటీలో నిలిచి ఏడుగురు విద్యార్థులు ఇన్ఫోసిస్ నియామకాలను సొంతం చేసుకున్నారు. ఈ విజయంపై కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ విద్యార్థులను అభినందిస్తూ, "ఇది తమ విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించే గర్వకారణమని, ఇంత ప్రతిష్ఠాత్మక సంస్థలో అవకాశం పొందడం తమ కళాశాలకి గౌరవమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానంలో మెలకువలు పాటించి తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చని అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి సిహెచ్.లచ్చన్న అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్‌కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం డిపిఎం లచ్చన్న మాట్లాడుతూ జిల్లా లో ప్రతి రైతు కూడా ఏటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ లో పంటలు వేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. అందుకు ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్ అందరూ కృషి చేయాలని సూచించారు.

ఘనంగా ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు గురువారం అనకాపల్లి పట్టణ ప్రభాస్ ఫాన్స్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర థియేటర్‌లో వైభవంగా జరిగాయి. థియేటర్ అధినేత మళ్ల వెంకట్రావు కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. థియేటర్లో పనిచేసే స్టాఫ్‌కు టీ షర్టులను పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ ప్రతినిధులు జీవీఎల్ఎన్ రాజు, కాండ్రేగుల జోగేంద్ర, కొణతాల అరవింద్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, దంతులూరి కళ్యాణ్ కుమార్, ఏజెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : రేబాక గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త గొగడ శ్రీను ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని నరసింగరావుపేటలోని ఎంవిఆర్ ప్రధాన కార్యాలయానికి పట్టణంలోని శారదా నది ఒడ్డున వెంచేసి ఉన్న శ్రీఉమా సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానపు కమిటీ సభ్యులు ఆహ్వానపు పత్రికను తీసుకొచ్చి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)కు అందించారు. మహిళలు అధికంగా వచ్చే అవకాశాలు ఉంటాయని, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోని, స్వామి వారి దర్శనం ఆయ్యేటట్లు చూడాలని ఎంవిఆర్ సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అడ్డబోయిన నారాయణరావు, బుద్ధ భగవాన్, పలకా కాసులు, కంచి రామారావు, పల్లా శ్రీను, సతీష్, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

భారీ వర్షాలతో రైతుల్లో గుబులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : తుపాను నేపథ్యంలో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉదయం నుండి మండలంలోని పలు గ్రామాల్లో చిరుజల్లులు కురుస్తూ, వెంటనే ఎండ కాస్తు ఎండా వాన దోబూచులాడింది. మధ్యాహ్న సమయంలో వర్షం కురవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో రైతుల వేసిన వరి పంట ఏపుగా పెరిగి పాలు పోసుకునే సమయం కావడంతో భారీ వర్షాలకు వరి పంట పడిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో చెరువులన్నీ నిండు కుండను తలపిస్తున్నాయి. ఏ మాత్రం భారీ వర్షాలు కురిసిన చెరువుల్లో నీరు చేరి పొంగి ప్రవహించే ప్రమాదం ఉంది.

కశింకోట : కశింకోట మండలంలో అల్పపీడనం కారణంగా గురువారం ఉదయం నుండి వర్షం కురుసింది. పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. పట్టణ ప్రాంతానికి పనులకు వెళ్లే కూలీలకు ఇంటికే పరిమితమయ్యారు. మండలంలోని కస్నూరుపాలెం, తీడ, అచ్చర్ల రోడ్లు గుంతలలో వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఎస్ రాయవరం .: అల్పపీడన ద్రోణి కారణంగా గురువారం మధ్యాహ్నం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు రైతన్నల గుండెల్లో గుబులు పుడుతుంది. ఇప్పటికే ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు వరహనది ఉధృతంగా ప్రవహిస్తున్నందంలో లోతట్టు ప్రాంతాలలోని వరిపొలాలు మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.మరో రెండు రోజులు భారీ వర్షాలు పడవచ్చని వాతావరణశాఖ హెచ్చరికలతో మండలంలోని వల్లవు గ్రామాలైన లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, పిట్లపాలెం, వెంకటాపురం, ఉప్పరపల్లి, తదితర గ్రామాలలోకి వరదనీళ్ళు చేరే అవకాశం ఉంది..

గేదె మృతదేహం వద్ద రోదిస్తున్న బాధిత మహిళా రైతు

విద్యుదాఘాతానికి ఆవు మృతి

ప్రజాశక్తి-కశింకోట : భారీ వర్షం కారణంగా విద్యుత్ వైర్లు తెగి పడడంతో విద్యుత్ షాక్‌కు గురై ఒక ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన దోమధుల ఆదిలక్ష్మి పాడి ఆవు వారి వ్యవసాయ భూమిలో గురువారం సాయంత్రం గడ్డి మేస్తుంది. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ లైన్ వైరుపై పడ్డాయి. దీంతో విద్యుత్ వైర్లు తెగి ఆవు మీద పడటంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.60 వేలు ఉంటుంది. ఆవు తమ జీవనాధారమని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

కోటవురట్ల : అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా జోరు వానతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు, పలు ప్రాంతాల్లో రోడ్లపై నుంచి నీరు ప్రవహించడంతో వాహనదారులు అవస్థలు పాలయ్యారు. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. నదీ పరివాహక లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవకు నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-పరవాడమ : ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకానికి నిధులు విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో గురువారం జరిగిన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వైద్య సేవకు బిల్లులు చెల్లించకపోవడంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు సెప్టెంబర్ 24 నుండి ఓపి, అక్టోబర్ 10 నుండి ఎమర్జెన్సీ సేవలు అన్ని బంద్ చేశాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ రాష్ట్రవ్యాప్తంగా 2700 కోట్లు బకాయి పెట్టిందన్నారు. యాక్సిడెంట్ కేసులు, గర్భిణీలు సొంత ఖర్చులతో వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గనిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం పేదలకు అందని దక్షగా మారుతుందన్నారు. ప్రైవేటీకరణ విధానాలను ఇప్పటికైనా మానుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే వైద్య సేవలను, మెడికల్ కాలేజీలను నిర్వహించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ

ఏకోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏకోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని గురువారం అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారి కోటేశ్వరరావుకు యుటిఎఫ్ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు మామిడి బాబూరావు మాట్లాడుతూ ఏకోపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, సెలవు పెట్టడానికి కూడా అధికారులను, తోటి ఉపాధ్యాయులను డెప్యుటేషన్ కోసం బతిమిలాడుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉండే మిగులు టీచర్లను గుర్తించి ఏకోపాధ్యాయులు సెలవు పెట్టిన రోజున వారి స్థానంలో మిగులు టీచర్లను డిప్యూటేషన్‌పై నియంచించాలన్నారు. సిఆర్ఎంటిలను కూడా ఏకోపాధ్యాయుల స్థానంలో నియమించడానికి ప్రభుత్వం గతంలో మార్గదర్శకాలు విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో సిఆర్ఎంటిలను కూడా వారి స్థానంలో నియమించని ఎంఈఓని కోరారు. సిఆర్ఎంటిలను మండల విద్యాశాఖ అధికారి ఆఫీసులోనే ఉంచుకోవడం సరికాదని పేర్కొన్నారు. యుటిఎఫ్ నాయకులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎంఈఓ కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జివిఎస్ ప్రకాష్, మండల నాయకులు సత్యవేణి జగన్నాథం, రాము , జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

రైల్వే డిఆంకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రైల్వే స్టేషన్‌లో 'అమృత సంవాదం'

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి రైల్వే స్టేషన్‌లో గురువారం 'అమృత సంవాదం' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ సీనియర్ డివిజనల్ మేనేజర్ నరేంద్రవర్మ ఇక్కడ ప్రయాణీకుల విజ్ఞప్తులు స్వీకరించారు. ప్రశాంతి, రత్నాచల్, మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని పలువురు ప్రయాణీకులు, సంఘాల ప్రతినిధులు వినతి పత్రాలు సమర్పించారు. ఇక్కడ పెదపల్లి గేటు దగ్గర ఆర్‌యుబి నిర్మాణం కూడా వెంటనే చేపట్టాలని కోరారు. దాదాపు 14 గ్రామాల ప్రజలు మున్సిపాలిటీలోకి ప్రవేశించడానికి 24 గంటల్లో గేటు సుమారు 14 గంటలు మూతపడడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జయంత్ కమాలాకర్, శర్మ, పిట్లా సత్తిబాబు, ఎక్స్ సర్వీస్ మేన్ అసోసియేషన్ ప్రతినిధి నక్కా శివశంకర్, వాకర్స్ క్లబ్ ఆడారి పూరీ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈదులపాక బోనంగి గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతుల కోసం అవగాహన సదస్సు, ఉచిత పశు వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెరిటేజ్ డైరీ పాడి రైతుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, పాల సంఘం అధ్యక్షుడు ఎల్లపు శివ, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో ఎన్‌సిసి కేడెట్ల ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నూతనంగా ప్రారంభమైన ఎన్‌సిసి గర్ల్స్ సబ్ యూనిట్ నుండి మొత్తం 25 మంది విద్యార్థినులు క్యాడెట్లుగా ఎంపిక అయ్యారు. ఈ ఎంపిక కార్యక్రమం 2(ఎ) గర్ల్స్ బెటాలియన్, విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుబేదార్ మేజర్ ధర్మవీత్ బోదెల్ (సేనా మెడల్) పర్యవేక్షణలో, సుబేదార్ నాగేశ్వరరావు, హవల్దార్ ములేయ్, హవల్దార్ బాషాల పాల్గొన్నారు.

ప్రసాద్‌కు ఎంవిఆర్ సన్మానం

ప్రజాశక్తి- అనకాపల్లి : అచ్యుతాపురానికి చెందిన ఎంఎస్ఎన్ ప్రసాద్ ఇటీవల జరిగిన ఫార్మాసిటీ యూనియన్ ఎలక్షన్స్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా గురువారం ఎంవిఆర్ తన కార్యాలయంలో ప్రసాద్‌ను సన్మానించారు. అందరితో మంచిగా ఉంటూ, యూనియన్ సభ్యుల కష్టసుఖాల్లో పాలుపంచు కోవాలని ఎంవిఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రను కలిసిన ప్రగడ

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విశాఖపట్నంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రతో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

మండల సభలో మాట్లాడుతున్న పిఎసిఎస్ అధ్యక్షులు బుజ్జి

జగనన్న లేఅవుట్ల మిగులు భూమిలో
అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి

▸▸ నక్కపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి : గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల పట్టాల పంపిణీ పారదర్శకంగా చేపట్టలేదని, వైసిపి కార్యకర్తలకు, అనర్హులకు అందచేశారని నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు, టిడిపి నేత కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ నానాజీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో మిగులు భూమి ఆక్రమణకు గురవుతోందని, దాన్ని దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని తహసిల్దారు నరసింహమూర్తి నికోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ, ఇళ్ళ స్థలాల కోసం అర్హులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీనిపై వైస్ ఎంపీపీ వీసం నానాజీ స్పందిస్తూ, నక్కపల్లి జగనన్న లేఅవుట్ సంబంధించి అర్హులకు మాత్రమే పట్టాలు ఇచ్చామని బదులిచ్చారు. గత టిడిపి ప్రభుత్వహయాంలో అప్పటి ఎమ్మెల్యేగా వంగలపూడి అనిత 2018లో ఉపమాక పంచాయితీ, సారిపల్లిపాలెం వద్ద త 26 మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, అధికారులు పట్టాలు కూడా ఇచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రద్దుచేసి ఆ స్థలాన్ని జగనన్న లే అవుట్‌కు కేటాయించారన్నారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని కోరగా, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని తహసిల్దార్ నరసింహమూర్తి అన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని వేంపాడు ఎంపిటిసి కుంచే మధు కోరారు. దీనిపై తహసిల్దార్ స్పందిస్తూ కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలకు ఆదేశాలివ్వడంతోపాటు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. అసంపూర్తిగా జలజీవన్ మిషన్ పనులతో ఇబ్బందులపై పలువురు సభ్యులు ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ ఆనంద్‌ను ప్రశ్నించగా, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం పనిచేసేందుకు ముందుకు రావడంలేదని, రెండు వారాల్లో ఆయా పనులను పూర్తి చేస్తామన్నారు. గొడివాడ వాటర్ ప్రాజెక్ట్ లో విద్యుత్ సమస్యతో నీటి సరఫరాకు అంతరాయంపై నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి డిఇఇ దృష్టికి తెచ్చారు. పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్విన రోడ్డు గోతులతో ఇబ్బందులపై ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, ఎంపిటిసి బచ్చల రాజు తదితరులు డిఇఇ దృష్టికి తీసుకువెళ్లారు. న్యాయంపూడి ఎంపిటిసి ఆకేటి గోవిందరావు, తీనార్ల ఎంపిటిసి మెరుగు నాగేశ్వరరావు, డిఎల్ పురం ఎంపిటిసి కొండ్ర కనకారావు తదితర సభ్యులు పలు సమస్యలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయ, ఎంపిడిఓ సీతారామరాజు, వైస్ ఎంపిపి వెలగా ఈశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ, వెలగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి-యస్ రాయవరం: మండలంలో పలు గ్రామాలలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. గురువారం ఉదయం, సర్వసిద్ధి, సైతారుపేట, ఉప్పరపల్లి గ్రామాల సచివాలయం వద్ద యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. .చిన్న సన్నకారు వరి రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారు.కొబ్బరి, మామిడి, జీడీ తోటల రైతాంగం కొందరు అధికార పార్టీ నేతలతో సిఫారసుతో యూరియాను పక్క దారి పట్టిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనిపై .సంబంధిత అధికారులతో రైతులో వాగ్వివాదానికి దిగారు. దీంతో పోలీస్ బందోబస్తు నడుమ రైతులకు యూరియా పంపిణీ జరిగింది. దీనిపై మండల వ్యవసాయాధికారి సౌజన్యను వివరణ కోరగా రైతులందరికీ సరిపడా యూరియా ఉందని, అయితే అవసరం లేనప్పటికీ కొందరు రైతులు ముందుస్తుగా యూరియాను జాగ్రత్తగా దాచుకోవడానికి చూస్తుండడం వల్ల డిమాండ్ పెరిగిందన్నారు. యూరియా పక్కదారిపట్టిందన్న ఆరోపణలు అవాస్తవమని, ఏయే రైతుకు ఎంతెంత యూరియాఇచ్చామో రికార్డుల్లో ఉందన్నారు. పక్క మండలాల నుండి కూడా రైతులు రావడంతో గందరగోళం జరుగుతోందన్నారు.

సంయమనం పాటించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల : మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామంలో ఇటీవల మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ ధ్వంసం నేపథ్యంలో ప్రజలంతా సంయమనం పాటించాలని డిఎస్‌పి శ్రీనివాస్, రూరల్ సిఐ రేవతమ్మ సూచించారు. గురువారం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ నాయకులను గౌరవించుకోవాలని, కుల మతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించకుండా, గ్రామస్తులంతా ఐకమత్యంతో ఉండాలని సూచించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ దామోదర్ నాయుడు పాల్గొన్నారు

కష్టపడే వారికి వైసిపిలో గుర్తింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని,రాబోయే రోజుల్లో మళ్లీ వైసిపికి అధికారం ఖాయమని, మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావుకు గొలుగొండ బూత్ కమిటీ అధ్యక్షునిగా నియమించిన సందర్భంగా గురువారం ఉమాశంకర్ గణేష్‌ను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా చంద్రరావు మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా పార్టీ బలోపేతానికి తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పాణి శాంతారాం, నాగాపురం వైసీపీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, యర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు కిట్లు

ప్రజాశక్తి -కొత్తకోట/ రావికమతం : సమగ్ర శిక్ష సహిత ఆధ్వర్యంలో ఆరుగురు వికలాంగ విద్యార్థులకు మేధోవైకల్య బోధనోపకరణ సామాగ్రి (ఎంఆర్) కిట్లు) అందజేసినట్లు ప్రత్యేక ఉపాధ్యాయులు బి. మహాలక్ష్మి నాయుడు, జగన్నాథనాయుడు తెలిపారు. గురువారం చోడవరం భవిత కేంద్రంలో ఏ.పి సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రావికమతం మండలానికి చెందిన ఆరుగురు మానసిక వికలాంగ విద్యార్థులకు సుమారు రూ.60 వేల విలువైన కిట్లును జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారి బి.రామకృష్ణ నాయుడు అందజేసారన్నారు.

మండలంలో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న నలుగురు మానసిక వికలాంగ విద్యార్థులతోపాటు భవిత కేంద్రంలో చదువుతున్న ఇద్దరికి ఈ కిట్లను అందజేశారు. త్వరలో మండలంలోని వికలాంగ విద్యార్థులకు ఉచితంగా వీల్‌ఛైర్లు, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలను అందజేస్తామన్నారు.

ఎట్టకేలకు కేసు నమోదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలపై ప్రశ్నించానన్న అక్కసుతో తనపై దాడి చేసి చంపాలని చూస్తున్నారని ఉడతపల్లి జానకిరామ్ (జాన్) ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. గత నెల 14న జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసినా స్థానిక పోలీసులు స్పందించకపోవడంతో అనకాపల్లి కలెక్టరేట్‌లోని ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక, జిల్లా పోలీస్ కార్యాలయంలో జాన్ ఫిర్యాదు చేయగా దానిపై కదలిక వచ్చింది.సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ కమిటీపై టౌన్ సిఐ గోవిందరావు కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలివి. గత నెల 14న ఆదివారం నర్సీపట్నం సెంటినరీ చర్చిలో జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తుండగా చర్చిలో భక్తులు సమర్పిస్తున్న కానుకలు, కోర్టు కేసుల్లో ఉన్న స్థలాలకు సంబంధించి ప్రశ్నించగా, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న నెల్లూరి నవీన్ కుమార్ (బబ్బు), నెల్లూరు నిచ్చల్ రాజన్, కె. రంజిత్ కుమార్, చొప్ప రోహిణి రోజ్ (జాజి), నెల్లూరి క్లారా దయాన (ప్రైనీ) తనపై దాడి చేశారని జానకిరామ్ ఫిర్యాదు చేశారు.ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ జరిపి కేసు నమోదు చేశామనిపట్టణ ఇన్స్పెక్టర్ గోవిందరావు తెలిపారు.

ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వద్దు

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- మాడుగుల : ప్రభుత్వ వైద్యకళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దీనిపై ప్రజలను చైతన్యపరిచి కోటి సంతకాల సేకరణతో బుద్ధి చెప్పాలన్నారు. గురువారం మండలంలోని కింతలి, కింతలి వల్లాపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు, ఎంపిపి తాళ్లపురెడ్డి రాజారామ్, జడ్పిటిసి కిముడు రమణమ్మ,మాజీ ఎంపిపి రామదర్జు,కింతలి వల్లాపురం సర్పంచ్ రాంబాయి రాంబాబు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్,సేనాపతి కొండలరావు,బొమ్మిశెట్టి శ్రీను నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో సంతకాల సేకరణలో బూడి, తదితరులు

విశాఖ కలెక్టరేట్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వైసిపి చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. బిసి సంఘం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ హాజరయ్యారు.

ఉక్కునగరం: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 85వ వార్డు పరిధి అగనంపూడి కూడలి రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసిపి నేతలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షులు పూర్ణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క రమణబాబు, యలమంచిలి అప్పారావు, కొల్లిపాక అప్పారావు, ఉబ్బా రాము, ఇల్లపు వాసు, గుర్రం శ్రీను, మామిడి శ్రీను, విందుల ప్రసాద్, ఏదూరి పైడిరాజు, సేనాపతి పార్వతి, పితాని నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి కణితి కాలనీ టిజిఆర్.నగర్‌లో వార్డు వైసిపి అధ్యక్షులు బొడ్డ గోవింద్ ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ముద్దపు దామోదర్, బొండా గోవిందరాజులు, బి.వెంకటసూరి, ప్రగడ శ్రీనివాస్, చిత్రాడ వెంకటరమణ, బొడ్డ సంజీవ్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతంచేయాలి

వేపగుంట, పెందుర్తి : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం సబ్బవరం జంక్షన్‌లో, సాయంత్రం వరవాద జంక్షన్ నిర్వహించే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. రాంపురంలోని కార్యాలయంలో పెందుర్తి మండల నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బైలపూడి భగవాన్ జయరాం, మధుపాద అంజి, గోరపల్లి శ్రీను, రాపర్తి మాధవరావు, తమర్ల నర్సింగ్, మెంతి మహేష్, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, బోరయ్య, గోరపల్లి సాంబ, గొంప అప్పారావు, మువ్వల శ్రీను, శేఖర మంత్రి శ్రీను, మహేష్, బొట్ట గోవింద్, వేపాడ శ్రీను, మురళి, జతిన్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుకో గురువారం వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యాన స్థానిక గాంధీనగర్ పరిధిలో ఉన్న విద్యాసంస్థల విద్యార్థులతో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డేడపల్లి హేమంత్ కుమార్, నాయకులు రాయి రాజా, బాలాజీ, సూరంపూడి శ్రీకాంత్, మడక కార్తీక్, రాయవరపు జోగిరాజు, దొడ్డి బాల సాయి, వియ్యపు వినయ్, మురళీ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- నక్కపల్లి : వర్షాలు కురుస్తున్నందున ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టాలని ఎంపిడిఓ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఓ చలపతిరావు అన్నారు. గురువారం మండలంలో జానకయ్యపేట లో పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణ, డ్రైనేజీల క్లీనింగ్ విధానాన్ని పర్యవేక్షించారు. వర్షాలు కురుస్తున్నందున కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. తడి పొడి చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిమెట్లు ఏర్పాటు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండల కేంద్రమైన రాయవరంలో గ్రామస్తులు నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం వద్ద పడిమెట్లను ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నుంచి 18 పడి మెట్లు, ద్వారబంధాలను ఆలయం వద్దకు తీసుకొచ్చి గురువారం సాయంత్రం ఏర్పాటుకు సిద్ధం చేసారు. సుమారు రూ.18 లక్షల వ్యయంతో గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్టు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో కొణతల శ్రీను,సోమిరెడ్డి రాజు,కమిశెట్టి ప్రకాష్, పిట్ల నాయుడు, యడ్ల వరహాలరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ మత్స్యకారుల ఆందోళన

కారిపోతున్న టెంట్‌లో నిలబడి ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-నక్కపల్లి : బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు వర్షంలోనూ గురువారం నిరసన కొనసాగించారు. .మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు గురువారం 40 వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి శిబిరం వద్దకు వర్షపు నీరు వచ్చి చేరడంతో ఆ ప్రాంతం బురద మయంగా మారింది.

గురువారం వర్షం కురవడంతో మత్స్యకారులు కూర్చునేందుకు అవకాశం లేకపోయి నప్పటికీ నిలబడి తమ ఆందోళనను కొనసాగించారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడుతామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. పోరాట కమిటీ నాయకులు ఎం. మహేష్‌బాబు, జీ.సోమేశ్వరరావు, పి.తాతీలు, ఎం.జాన్, బి.బాబ్జీ, కె.కాశీరావు, రామ్ చరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రాజయ్యపేటకు జిల్లా కలెక్టర్

నక్కపల్లి : మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్య పేటకు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రానున్నట్లు తహసిల్దార్ నరసింహమూర్తి మత్స్యకారులకు తెలిపారు. గురువారం కలెక్టర్ పర్యటన ఏర్పాట్లను తహసిల్దార్ నరసింహమూర్తి, సీఐ మురళి పర్యవేక్షించారు. బల్క్ డ్రగ్ పార్క్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పోరుబాట పట్టడంతో శుక్రవారం కలెక్టర్ గ్రామానికి వచ్చి మత్స్యకారులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకోనున్నారు. రాజయ్యపేటలో 40 రోజులుగా శాంతియుతంగా రిలే దీక్షలు, 12న నక్కపల్లిలో హైవే దిగ్బంధం వంటి ఆందోళనలతో , జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆందోళనకారుల వద్దకు వచ్చి ఈనెల 15న మాట్లాడతానని ప్రకటించినా, అనివార్య కారణాలతో రద్దు అయ్యింది. 19న కలెక్టర్ వస్తారని ముందు రోజు రాత్రి అధికారులు చెప్పగా, సడన్ చెబితే ఎలాగని మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వాయిదా పడిన కలెక్టర్ పర్యటన, శుక్రవారం రానుండడంతో మత్స్యకారులందరూ సన్నద్ధంగా ఉన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు వద్దన్న తమ డిమాండ్‌ను గట్టిగా కలెక్టర్ ముందు స్పష్టం చేయాలని నిర్ణయిచారు.

కలెక్టర్ సమావేశానికి నాయకులకు అనుమతివ్వాలి

నక్కపల్లి : బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ తాము చేపట్టిన పోరాటానికి మద్దతు ఇస్తున్న నాయకులను రాజయ్యపేట వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని, అదేవిధంగా కలెక్టర్‌తో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని బల్క్ డ్రగ్ పోరాట కమిటీ నాయకులు కోరారు. గురువారం తహసిల్దారు నరసింహమూర్తి, సిఐ మురళికి వినతిపత్రం అందజేశారు. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ 40 రోజుల నుండి శాంతియుత రిలే దీక్షలు కొనసాగిస్తున్నామని, తమ పోరాటానికి మద్దతునిస్తున్న నాయకులు రాజయ్యపేటకు వచ్చేందుకు పోలీసులు ఆంక్షలు పేరిట అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ వస్తున్నందున సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, ఉమాదేవి తదితర నాయకులు రాజయ్యపేట వచ్చేందుకు, తమ తరుపున మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సిఐ, తహశీల్దార్లకు వినతిపత్రాలిస్తున్న పోరాట కమిటీ నాయకులు

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

నినదిస్తున్న ముఠా కార్మికులతో కోటేశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఎన్‌టిఆర్ స్టేడియంలో ముఠా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగుతున్నాయని, జనవరి 4న ఆర్కే బీచ్‌లో భారీ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ ముఖ్యఅతిథిగా హాజరబోతున్నారు, బహిరంగ సభకు కార్మిక లోకమంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మికులను నిర్లక్ష్యంగా గాలికి వదిలేశాయన్నారు. కార్మిక సంక్షేమ నిధి ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డు ద్వారా ముఠా కార్మికులకు ప్రమాద బీమా, పిల్లలు స్కాలర్షిప్లు, వివిధ సంక్షేమానికి ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి భవిష్యత్తులో దేశ వ్యాప్త ఉద్యమ నిర్మాణాన్ని చేయడానికి విశాఖపట్నంలో జరుగు మహాసభలు వేదిక కానున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటి జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, హుటా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు, కె.నానాజీ ఎం. గోవిందు, ఎం.రమణ, రాము, సాంబ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు వేతన బకాయిలు, బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. . నర్సీపట్నం నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తమ సమస్యలపైన ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.ప్రసన్న మాట్లాడుతూ ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు,వేతనాలు చెల్లించక పోవడంతో పథకం నిర్వహణకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోపక్క పెంచిన మెనూ ఛార్జీలు అమలు చేయడం లేదన్నారు. వంటగ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలని, 9,10 తరగతులకు కుకింగ్ ఛార్జింగ్ చెల్లించాలని, ప్రమాద బీమా, కనీస వేతనాలు, ఐడి కార్డులు, యూనిఫామ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, నర్సీపట్నం మాకవరపాలెం మండలాల నాయకులు ఒమ్మి నూకరాజు, చిన్న తల్లి, సత్యవతి, రమణ, సిఐటియు నాయకులు ఈరెళ్ల చిరంజీవి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి రన్నింగ్ పోటీలకు భాగ్యశ్రీ

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మోపాడ భాగ్యశ్రీ పరుగు పందెం పోటీల్లో సత్తా చాటింది.అండర్ 17 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు రన్నింగ్‌లో జిల్లా స్థాయికి భాగ్యశ్రీ ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు, పిడి ఎల్.మధుసూదన్, స్కూల్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది ఆమెను అభినందించారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?

బెల్ట్‌షాపుల నియంత్రణలో నిండా నిర్లక్ష్యం : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి- మాడుగుల : వి,మాడుగుల ఎక్సైజ్ పరిదిలో గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను తక్షణమే తొలగించి, తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 13 జిల్లా కలెక్టర్‌కు పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేసినా సరైన స్పందన లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరటం నరసింహమూర్తి, కార్లే భవాని విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారులు బరితెగించి, గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. చిన్న గ్రామాల్లో సైతం కిల్లీ, టీ దుకాణాలు, దాబాల్లోనూ విచ్చల విడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణకు లక్షల్లో అనధికారిక వేలం పాటలు నిర్వహించి బాహాటంగా బెల్టుషాపులు యజమానులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. విచ్చలవిడి మద్యంతో మహిళలు, బాలికలకు రక్షణ లేకపోగా, గ్రామాల్లో శాంతిభద్రతలు క్షీణించే పరిస్థితి ఉన్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్‌షాపుల మద్యం వ్యవహారంపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుతో 14న జిల్లా ఎక్సైజ్ శాఖ అదికారులు వచ్చి ఫిర్యాదు దారుని సమక్షంలో రెండు మద్యం బెల్ట్ షాపులపై దాడులు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. దీనిపై సోమవారం మరోసారి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని నేతలు వెల్లడించారు.

జాబ్‌మేళాలో 224 మందికి ఉద్యోగాలు

జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది, రాష్ట్ర హోం మంత్రి ఆదేశాల మేరకు మండల టిడిపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు ప్రోద్బలంతో 18 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ గోవిందరావు మాట్లాడుతూ 1740 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహించామన్నారు. 425 మంది జాబ్‌మేళాకు రాగా, వారిలో 224 మందిని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో కొప్పిశెట్టి వెంకటేష్,మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు వేచలపు జనార్దన్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు పి సూర్యారావు, జానకి హరి, కళాశాల ప్రిన్సిపల్ సుజాత పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో జానకయ్యపేట గ్రామంలో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కురందాసు నాగ సత్యవేణి, కూటమి నాయకులు కురుందాసు నూకరాజు, సింహాచలం, అప్పలరాజు రైతులకు యూరియా అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో
మీ ప్రకటన
వేయబడును.
మీ సేవలు
మరువలేనివి,
మీరెక్కడున్నా
మీ శ్రేయస్సును
కోరుకుంటాం,
అందించండి.
ప్రజాశక్తి ద్వారా
శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు,
బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు,
ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని
ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ : 9490099125	పూర్ణమార్కెట్ : 9490099676
మధురవాడ : 8008596645	జగదాంబ : 9490099434
గాజువాక : 9849392359	జివియంసి : 9490099483
అనకాపల్లి : 8008736188	ద్వారకానగర్ : 9490099672
చోడవరం : 9490099141	కంచరపాలెం : 9490099135
నర్సీపట్నం : 9440280411	మాదవధార : 9490099675
పాడేరు : 9490099142	
రంపచోడవరం : 9440165617	